క్లుప్తంగా

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో, కళాశాల రోడ్డులో వేంచేసిన అల్లూరి పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కళాశాల రోడ్డులో వెలసిన పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలను అర్చకులు అమర్నాథ్ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తారని, మండలంలోని అన్నీ ప్రభుత్వశాఖల అధికారులు వారి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

21 న విద్యుత్ అదాలత్

గిద్దలూరు రూరల్: సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మార్కాపురం ఈఈ పి.వి.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు విజయవాడ నుంచి సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ పాల్గొననున్నట్లు చెప్పారు. గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు చేయవచ్చన్నారు. విద్యుత్ సరఫరా పై ఏమైనా సమస్యలు ఉన్నా, బిల్లుల లోటుపాట్లు వంటి ఇతర విద్యుత్ సమస్యలను తెలియజేయాల్సిందిగా కోరారు.

25 కుక్కల పట్టివేత


కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

మార్కాపురం టౌన్: పట్టణంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న 25 కుక్కలను పట్టుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తెలిపారు. ఇటీవల కాలంలో తరచుగా పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ, పీఎస్ కాలనీ, ఎస్సీ బీసీ కాలనీ, నానాజాతుల పేట, కంభం రోడ్డు, మెయిన్‌రోడ్డు, జేఎస్ కాలనీ, ఏకలవ్య నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కలను పట్టుకున్నారు. మున్సిపల్ ఏరియాలో 4, పుత్తూరు హాస్పిటల్ ఏరియాలో 7, జవహర్‌నగర్ కాలనీలో 5, ఏకలవ్య కాలనీలో 9 శునకాలను పట్టుకున్నారు. వీటికి పునరుత్పత్తి జరగకుండా స్నేహ యానిమల్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ చేస్తున్నట్టు చెప్పారు.

భార్యపై ఇనుప రాడ్డుతో దాడి

పొదిలి రూరల్: స్థానిక విశ్వనాథపురంలో నివాసం ఉంటున్న షేక్ ఖాజా రహ్మతుల్లా తన భార్య సాజిదా బేగంను ఈ నెల 16వ తేదీ రాత్రి ఇనుప రాడ్డుతో కొట్టడంతో ఆమె తలకు గాయమైంది. బంధువులు స్పందించి పొదిలి సీహెచ్‌సీలో చేర్పించి వైద్యం చేయించారు. వెటర్నరీ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న తన భర్త తరుచూ మద్యం తాగి హింసిస్తున్నాడని సాజిదా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేమన తెలిపారు.

పచ్చగడ్డి తమ్ముళ్లకే!

- పశుగ్రాసం యూనిట్లు టీడీపీ సానుభూతి పరులకే పందేరం
- టీడీపీ ముఖ్యనేత చెప్పినవారికే అనుమతులిస్తున్నట్లు ఆరోపణలు
- నూరు శాతం సబ్సిడీపై పశుగ్రాసం సాగుకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులంతా అర్హులే..
- ఉపాధి హామీ నిధులతో 10 నుంచి 50 సెంట్లలో సాగు చేసుకోవచ్చు


సూపర్ నేపియర్ బహువార్షిక గడ్డి

బేస్తవారిపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూరు శాతం సబ్సిడీపై బహువార్షిక పశుగ్రాసాల సాగుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్లు వరకు పశుగ్రాసం సాగుచేసుకోవచ్చు. పశుగ్రాసాల సాగుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ నిబంధనల ప్రకారం జాబ్‌కార్డు ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతో పాటు సన్న, చిన్న కారు రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగుకు అర్హులు. అయితే ఈ యూనిట్ల కేటాయింపులో టీడీపీ సానుభూతిపరులకే అగ్రతాంబూలం దక్కుతోందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేత సిఫార్సుతోనే అర్హులను ఎంపిక చేస్తున్నారని గ్రామాల్లో రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ప్రచారం నామమాత్రం

పశుగ్రాసం పెంపకానికి నూరు శాతం రాయితీ వర్తిస్తుందన్న విషయంపై గ్రామాల్లో రైతులకు అవగాహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అదే సమయంలో వేలకు వేలు ఖర్చు చేసి ఇతర ప్రాంతాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. టీడీపీ కూటమి నాయకులు మాత్రం ఈ పథకం గురించి తమ పార్టీ సానుభూతిపరులకు వివరించి దరఖాస్తు చేయించడం, వారికి వెంటనే అనుమతులు మంజూరు కావడం చకచకా జరిగిపోతున్నాయి. గ్రామాల్లో టీడీపీ కూటమి నేతల సిఫార్సు లేకుండా నేరుగా వచ్చిన దరఖాస్తులకు మోక్షం లభించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీనిపై స్పందించేందుకు పశువైద్యాధికారులు కూడా సుముఖత చూపడం లేదు.

ఇదీ పథకం..

10 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసేందుకు పూర్తి ఖర్చు రూ.6,599 అవుతుంది. ఇందులో లేబర్ కాంపోనెంట్ కింద రూ.3 వేలు, మెటీరియల్ కాంపోనెంట్(విత్తనం ధర, ఇతర ఖర్చులు) కింద రూ.3,599 చెల్లిస్తారు. 20 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ కాంపోనెంట్ కింద రూ.6 వేలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.7,197 చెల్లిస్తారు. 30 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ కాంపోనెంట్ కింద రూ.9 వేలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.10,795 మొత్తం రూ.19,795 చెల్లిస్తారు. 40 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ కాంపోనెంట్ కింద రూ.12 వేలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.14,394 మొత్తం రూ.26,394 చెల్లిస్తారు. 50 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చులు రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చులు రూ.17,992 వెరసి మొత్తం రూ.32,992 ఉపాధి హామీ నిధుల నుంచి చెల్లిస్తారు.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి

పశుగ్రాసం సాగుపై ఆసక్తి కలిగిన రైతులు ముందుగా దగ్గరలో ఉన్న పశువైద్యశాలలో డాక్టర్‌ను కలిసి వారికి ఎన్ని పశువులు ఉన్నాయి, ఎంత భూమి ఉందనే వివరాలు తెలిపి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తులతోపాటు ఉపాధి జాబ్‌కార్డు, భూమికి సంబంధించిన 1–బీ, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలతో మూడు సెట్లు తయారు చేసుకుని అధికారులకు అందజేయాలి. అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.


వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె, నాయకులు

భవనం వెంకటరెడ్డికి జంకె పరామర్శ

తర్లుపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భవనం రామచంద్రారెడ్డి తండ్రి భవనం వెంకటరెడ్డి అనారోగ్యంతో కొన్నిరోజులుగా గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి ఆదివారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను ఆరాతీశారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆయన కుమారుడు రామచంద్రారెడ్డికి ధైర్యం చెప్పారు.

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జంకె వెంట పార్టీ నాయకులు గాయం శ్రీనివాసరెడ్డి, సీహెచ్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిల గాండ్ల అన్నదాన సత్రం నూతన కమిటీ ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన అన్న సత్రం కమిటీ సభ్యులు

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోని అఖిల గాండ్ల అన్నదాన సత్రం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని కమిటీ ముఖ్యులు తంగెళ్ల నాగభూషణం, చిట్టింశెట్టి వెంకటసుబ్బారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, భీమవరం పిచ్చయ్య కోరారు. ఆదివారం వెలుగొండలోని అఖిల గాండ్ల అన్నదాన సత్రం ఆవరణలో నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. సత్రం గౌరవ అధ్యక్షులుగా బట్టు రామారావు, మహానంది, బల్లవరపు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా ఆళ్లచెరువు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా యేరువ కృష్ణారావు, కోశాధికారిగా ఆళ్లచెరువు మోహన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముద్దపాటి కృష్ణయ్య, మహిళా కార్యదర్శిగా మాద సుభద్రను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను అఖిల గాండ్ల సంఘం నాయకులు అభినందించారు. ఈ ఏడాది మార్చిలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ వేడుకకు హాజరైన పూర్వ విద్యార్థులు


ఉపాధ్యాయుడిని సన్మానిస్తూ..

తర్లుపాడు: వారందరూ 38 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు.. పాఠశాల చదవు ముగిసే సమయంలో మళ్లీ కలుద్దామని అందరూ అనుకున్నారు. ఆ మాట నిజరూపం దాల్చేందుకు 38 సంవత్సరాలు పట్టింది. 'అరేయ్.. నువ్వేంట్రా ఇలా అయిపోయావ్..' అంటూ ఒకరు, 'మరి నీ సంగతేంటి.. అప్పుడే బట్టతల వచ్చేసింది' అంటూ మరొకరు ఆటపట్టించున్నారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. 'ఈ రూముల్లోనే కదా మనం గోల చేసింది' అంటూ చిలిపి సంఘటనలు, గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఇందుకు తర్లుపాడు జిల్లా పరిషత్ పాఠశాల వేదికై ంది. ఆదివారం 1987–88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. వివిధ రంగాల్లో రాణిస్తూ పలు ప్రాంతాల్లో స్థిర పడిన వారంతా ఆత్మీయ వేడుకకు హాజరై చిన్ననాటి మిత్రుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువుచెప్పిన గురువులు ఎన్‌సీ కృష్ణారెడ్డి, గర్రె శ్రీనివాసరావులతోపాటు హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసులును సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పావులూరి శ్రీను, గాదంశెట్టి శేషగిరి, జి.కృష్ణారెడ్డి, ఖాశీం సాహెబ్, నరసింహారెడ్డి, జివి రంగారెడ్డి, ఇబ్రహీం, వై.రవీంద్రనాథ్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, జి.స్వామి, వీఆర్ఓ ఖాశీం వలి, వై జగన్‌మోహన్‌రెడ్డి, కె.రమాదేవి, కాశీరత్నం, వాణి, పద్మావతి, సుజాత, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు


నియామక పత్రం అందుకుంటున్న సముద్రాల వెంకటేశ్వర్లు

కొమరోలు: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా కొమరోలుకు చెందిన సముద్రాల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కొమరోలులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు నియామక పత్రాన్ని అందజేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణయ్య, ఆర్యవైశ్యులు సముద్రాల వెంకటేశ్వర్లును అభినందించి సన్మానించారు.

వ్యవసాయ కూలీల కోసం ఆర్టీసీ బస్సులు


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఆర్టీసీ డీఎం నరసింహులు, ఎంవీఐ మాధవ

మార్కాపురం: ప్రస్తుతం పొలాల్లో మిర్చి, పత్తి తదితర పంట కోతలకు గ్రామాల నుంచి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామని సీఐ పి.సుబ్బారావు, ఆర్టీసీ డీఎం కేఎస్ నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో వ్యవసాయ కూలీలను పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించుకుని వెళ్తున్న పలువురు డ్రైవర్లకు ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోలకు బదులుగా ఆర్టీసీ బస్సులను ఉదయం 8 గంటలకు దోర్నాల సెంటర్, కంభం రోడ్డులోని శ్రీనివాస థియేటర్ వద్ద వ్యవసాయ కూలీల కోసం బస్సులు సిద్ధం చేస్తామని డీఎం తెలిపారు. మిర్చి కోతలు అయిపోయిన తర్వాత మళ్లీ సాయంత్రం బస్సులోనే ఎక్కించుకుని వస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- జిల్లా ఆరో అదనపు జడ్జి శుభవాణి
- మార్కాపురంలో లయన్స్ క్లబ్ ప్రారంభం


ఏడీజే శుభవాణి చేతులమీదుగా నియామక పత్రం అందుకుంటున్న రామకృష్ణారావు

మార్కాపురం: లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా ఆరో అదనపు జడ్జి ఎం.శుభవాణి సూచించారు. మార్కాపురంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ నీరు అధికంగా ఉందని లయన్స్ క్లబ్ ద్వారా వీలైనన్నీ ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. సభ్యులందరూ క్రియాశీలకంగా ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అవకాశం ఉన్నప్పుడు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామని చెప్పారు. తాను చదువుకునే రోజుల్లో తన తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ 316హెచ్ జిల్లా గవర్నర్ పి.గోపీచంద్ మాట్లాడుతూ మార్కాపురం లయన్స్ క్లబ్ ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. మార్కాపురంలో క్లబ్ ఏర్పాటుకు కృషి చేసిన జోన్ చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్‌ను అభినందించారు. వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ హరిప్రసాదరావు మాట్లాడుతూ.. జిల్లా గవర్నర్ స్థాయిలో 12 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను మంజూరు చేయించేందుకు అవకాశం ఉందని, ఆయా ప్రాజెక్టులకు అవసరమయ్యే వ్యయంతో 25 శాతం మార్జిన్‌మనీ చెల్లించేందుకు ముందుకు వస్తే 75 శాతం ఆర్థిక సాయం లయన్స్ ఇంటర్నేషనల్ చేస్తుందన్నారు. క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన ఏపీజీబీ విశ్రాంత మేనేజర్ టీవీ రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన హెచ్ఎం ఎం.చంద్రశేకర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సేవలందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యక్షులుగా బార్ అసోసియేషన్ నాయకులు భూపని కాశయ్య, ఆర్.హరనాథబాబు, సహాయ కోశాధికారిగా డాక్టర్ మాధవరావు, సర్వీసు చైర్‌పర్సన్లుగా వి.వెంకటరామిరెడ్డి, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా బి.కోటేశ్వరరావు, మెంబర్‌షిప్ కోఆర్డినేటర్‌గా కె.చెంచిరెడ్డి, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్‌గా షేక్ మహబూబ్‌బాషా, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా ఎం.శివప్రసాద్‌తోపాటు పలువురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. జోన్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్‌తో పాటు నామినేని మోహన్‌రావు, వెంకట సుబ్బయ్య, జీఎస్టీ కోఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వర్లు, డాక్టర్ కనకదుర్గ, సయ్యద్ జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

మార్కాపురం:

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ గోబ్యాక్ అంటూ ఆదివారం మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటరులో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య, సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. రాజ్యాంగం అంటే గౌరవం లేని అమిత్‌షా మంత్రిగా ఉండే హక్కు లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మతోన్మాద భావజాలాన్ని తలకెక్కించుకుని హింసను రెచ్చగొట్టే విధంగా మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎంఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటరెడ్డి, డి.శ్రీనివాసులు, డీకేఎం రఫీ, ఎస్‌కే ఖాశీం, నన్నేసా, మల్లికార్జున, విక్టర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు యోగి వేమన


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

మార్కాపురం టౌన్: మహనీయుడు యోగి వేమన అని రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ పేర్కొన్నారు. ఆదివారం యోగివేమన జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరాడంబరుడైన యోగి వేమన పద్యాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రెడ్డి సేవా సంఘం తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు కంది ప్రమీలారెడ్డి, టి.రామిరెడ్డి, కె.రమణారెడ్డి, వి.వెంకటరెడ్డి, ఆర్‌వీ సుబ్బారెడ్డి, బి.శివరెడ్డి, జీసీహెచ్ వెంకటరెడ్డి, డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

మార్కాపురం: మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో నేటినుంచి పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బాలూనాయక్ పేర్కొన్నారు. మొత్తం 4 టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమ వాల్‌పోస్టరును ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తన నివాసంలో పశువైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 20న శివరాంపురం, గోగులదిన్నె, మాలపాటిపల్లి, నాయుడుపల్లి, కేతగుడిపి, తాడివారిపల్లి గ్రామాల్లో, 21న కొండేపల్లి, కొట్టాలపల్లి, నాయుడుపల్లి, దరిమడుగు, చెన్నారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో, 22న మాల్యవంతునిపాడు, వేములకోట, మన్నెంవారిపల్లి, తూర్పుపల్లి, కారుమానిపల్లి, గానుగనపెంట, ఉమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారం నుంచి 31వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. ముందుగా 20వ తేదీన కుంచేపల్లి, 21న పాములపాడు, 22న మల్లవరం, 23న సూదనగుంట, 24న ఆముదాలపల్లి, 25న కొండాయపాలెం, 27న తలమళ్ల, 28న ఉప్పలపాడు, 29న ఏలూరులో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పశుపోషకులు పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పద్మావతికి సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న పద్మావతి

మార్కాపురం: స్థానిక కమలా కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గుమ్మా పద్మావతి సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు అందుకున్నారు. ఆదివారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో ప్రైవేట్ కాలేజీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను తోటి అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి మండల స్థాయి పోటీలు

పొదిలి రూరల్: ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి మండల స్థాయి వ్యాసరచన, క్విజ్, ఓటింగ్‌కు సమానమైనదేదీ లేదు.. నేను తప్పక ఓటు వేస్తాను అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని యూపీ, హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాల, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులను పోటీలకు పంపాలని హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాళ్లకు విజ్ఞప్తి చేశారు. 6–12 తరగతుల వారు జూనియర్స్‌గా, డిగ్రీ విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. విజేతలకు 21వ తేదీన నియోజికవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు పొదిలి ఎంఈఓ 9490174988ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొమరోలు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక నయారా పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కొమరోలు నుంచి పోరుమామిళ్ల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, యర్రపల్లె నుంచి కొమరోలుకు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో యర్రపల్లె గ్రామానికి చెందిన సీహెచ్.తిరుమలరెడ్డికి తీవ్రగాయాలు కాగా, కొమరోలుకు చెందిన రాజశేఖర్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.